ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 9 మార్చి 2025 5




రంజాన్ వేళలు	ఇఫ్తార్ (ఆది)	సా.6.20
	సహరి (సోమ)	ఉ.4.54



నేటి నుంచి కోరుకొండ తీర్థం

నరసన్న బ్రహ్మోత్సవాలకు కోరుకొండ ముస్తాబైంది.. ఆదివారం నుంచి 15వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందిలేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



7



ఇదీ సత్తా : రాజమహేంద్రవరం స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో మహిళా స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పిస్తున్న ఆంధ్రకేసరి యువజన సమితి మహిళలు



ఆనం కళాకేంద్రంలో మహిళా దినోత్సవానికి జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, నన్నయ వీసీ ప్రసన్నశ్రీ చిత్రంలో ఎమ్మెల్యే వాసు.. హాజరైన ఉద్యోగినులు

గలీజుదారులు!

దాతల ఆశయాలకు తూట్లు

అవకాశం ఇస్తే గుడిని.. గుడిలో లింగాన్ని మింగేసే ఘనులున్నారు.. కూర్చోవడానికి చోటిస్తే పడుకోవడానికి చోటడిగే ప్రబుద్ధులున్నారు.. ఎందుకంటే దేవుడి భూమిని లీజుకు తీసుకుని ఆక్రమించేసేవారు ఎక్కువైపోయారు.. తనది కాని భూమి కోసం న్యాయం చేయమని కోర్టులను ఆశ్రయిస్తున్నారు..అయినా అధికారులు పట్టించు కోకుండా వదిలేస్తున్నారు.. దీంతో దాతల ఆశయం నీరుగారిపోతోంది.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్.. ఈ పేరు కూడా ఇప్పటి తరానికి తెలియదు. కానీ రాజానగరంలో అన్నదాన సత్రానికి ఏకంగా 188.89 ఎకరాలు విరాళంగా ఇచ్చారు. ప్రస్తుతం ఆ భూములు సమస్యల్లో చిక్కుకున్నాయి. కౌలు రైతులు ఆ భూములు మావేనంటూ కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. జిల్లాలో ఈ ఒక్క సంఘటనే కాదు.. ఆలయ భూములను లీజుకు తీసుకుని ఆక్రమించేసేవారు ఎక్కువైపోయారు.



ఇటీవల రాజానగరంలో స్వాధీనం చేసుకున్న 25.16 ఎకరాల భూమి(ఫైల్)

- ఆస్తులు ఘనం..ఆదాయం కనం
- వందేళ్లుగా వేలం పాటలే లేవు
- సత్రం భూములు అన్యాక్రాంతం
- 137 ఎకరాలు..రూ.16 లక్షలు
- అయినా శిస్తు చెల్లించని వైనం
- కోర్టులకు కౌలుదారులు
- మామూళ్ల మత్తులో అధికారులు
- కన్నెత్తిచూడని వైనం

రాజానగరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బాటసారులకు పట్టెడన్నం పెట్టాలనే సంకల్పం తో వందలాది ఎకరాల భూములను ధారాదత్తం చేసిన దాత ఆశయాలకు కొందరు స్వార్థపరులు తూట్లు పొడుస్తున్నారు. నామమాత్రపు శిస్తులు కూడా చెల్లించకుండా కౌలుదారులు కోర్టులను ఆశ్రయిస్తూ అధికారులను సైతం కోర్టు బోనుల్లో నిలబెడుతున్నారు. కాసులకు కక్కుర్తిపడుతున్న దేవాదాయ ధర్మాదాయ శాఖలోని కొంత మంది అధికారులు తప్పుడు సలహాలిస్తూ కౌలుదారులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దశాబ్దాల తరబడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉన్న వందలాది ఎకరాల అన్నదాన సత్రం భూములు కోర్టు కేసులతో మగ్గిపోతున్నాయి.

భూములపై లీజుదారుల కన్ను

శతాబ్దాల కిందట శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ అనే జమిందారు వాహన సౌకర్యాలు కూడా లేని రోజుల్లో మచిలీపట్నం నుంచి గుర్రం మీద పెద్దాపురం కప్పం వసూలుకు వెళ్లి వస్తూ రాజానగరంలో సేద తీరేవారు. ఆ సమయంలో ఈ ప్రాంతంలో దారినపోయే బాటసారులకు గుప్పెడు మెతుకులు పెట్టాలనే ఉద్దేశంతో రాజానగరంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. వందలాది ఎకరాలను అన్నదాన సత్రానికి సమకూర్చారు.కొన్నేళ్ల పాటు అన్నదానం సజావుగానే సాగింది. అయితే సత్రం సిబ్బందిపనితీరుతో పాటు బాటసారులు రావడం తగ్గింది.దీంతో సత్రం సిబ్బంది అన్నదానాన్ని అటకెక్కించి జేబులు నింపుకునే పనిలో పడ్డా రు. భూముల ధరలు పెరుగుతున్న తరుణంలో కొంతమంది లీజుదా రులు భూములపైనే కన్నేశారు.శిస్తులు చెల్లించ కుండా కోర్టులను ఆశ్రయిస్తున్నారు.



దాత జోగి జగన్నాథరావు పంతులు జమిందార్

సాగులో 137.78 ఎకరాలు

వందలాది ఎకరాల భూములను ధారపోసిన జమిందారు శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ వారి అన్న దాన (ఫీడింగ్) సత్రానికి సంబంధించిన 188.89 ఎకరాల భూములు సమకూర్చారు.వీటిలో 47.12 ఎకరాలు పేదల నివాస స్థలాలకు ప్రభుత్వం తీసుకుంది.పులిమేరులో 3.99 ఎకరాలు ఆక్రమణల్లో చిక్కుకున్నది.ప్రస్తుతం 137.78 ఎకరాలు కౌలు వ్యవసాయం కొనసాగుతుంది. వార్షికాదాయం రూ.16లక్షలకు మించి రావడం లేదు. ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి కౌలుదారులు,దేవాదాయశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్ల ఆదాయ కుంటుపడిపోతోందని ఆరోపిస్తున్నారు. కొంత మంది తక్కువ లీజు ఇస్తుంటే.. మరికొందరు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.మూడేళ్లకోసారి పాట నిర్వహించాల్సి ఉన్నా మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు చాలా ఏళ్లగా అటు వైపే చూడకపోవడం గమనార్హం. శతాబ్దాలుగా వేలం వేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.జిల్లా అధికారులైనా దృష్టి సారించారా అంటే అదీ లేదు. దాత ఆశయాలు నీరుగారుతున్నాయి.

ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి

పులిమేరు గ్రామంలోని 3.99 ఎకరాల భూమి ఆక్రమణలో ఉంది.దేవరపల్లి మండలం త్యాజంపూడిలోని ఉన్న 35 ఎకరా ల్లోని 27 ఎకరాలకు సంబంధించి కౌలుదారుడు శిస్తులు ఎగవేయడంతో కోర్టు వివాదంలో కొనసాగుతుంది. ఇటీవల రాజానగరంలోని 25.16 ఎకరాల భూమిని ఎండోమెంట్ అధికారులు స్వాధీ నం చేసుకుని బహిరంగ వేలం నిర్వహించారు. ఇదేవిధంగా అన్ని ప్రాంతాల్లో ఉన్న భూములకు బహిరంగ వేలం నిర్వహిస్తే మరింత ఆదాయం సమకూరుతుందని పలువురు రైతులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి దేవాదాయ ధర్మాదాయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూములు ఎక్కడెక్కడంటే...

ఈ సత్రానికి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా విలువైన పంట భూములు ఉన్నాయి.పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలో సర్వే నెంబరు 107లో 2.19 ఎకరాలు, సర్వే నెంబరు 108లో 4.11 ఎకరాలు, 109లో 3.3 ఎకరాలు,120లో 4.64 ఎకరాలు భూములు ఉన్నాయి. సర్వే నెంబరు 189లో 2.5 ఎకరాలు, 189లో 1.81 ఎకరాలు, 190లో 0.73 సెంట్లు, 193లో 1.45 ఎకరాలు, 98లో 0.98 ఎకరాలు భూములు ఉన్నాయి.రాజానగరంలో సర్వే నెంబరు 135లో 11.97 ఎకరాలు, 161/1లో 3.49 ఎకరాలు, 161/1లో 0.53 సెంట్లు, 164లో 3.08 ఎకరాలు, 165లో 3.54 ఎకరాలు, 20లో 2.87 ఎకరాలు, 27లో 5.48 ఎకరాలు, 28లో 7.10 ఎకరాలు, కలవచర్లలో సర్వే నెంబరు 342లో 14.11 ఎకరాలు రికార్డులో దఖలు పడి ఉన్నాయి. ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో సర్వే నెం బరు 242లో 4.54 ఎకరాలు, 252లో 2.96 ఎకరాలు, 342లో 2.11 ఎకరాలు, 345లో 0.74 ఎకరాలు, 348లో 7.22 ఎకరాలు, 350లో 1.99 ఎకరాలు, 364లో 6.38 ఎకరాలు, 365లో 6.90 ఎకరాలు, 629లో 2.39 ఎకరాలు, 632లో 2.78 ఎకరాలు ఉన్నాయి.దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామంలో సర్వే నెం బరు 245లో 35.05 ఎకరాలు,378/2లో 9.36 ఎకరాలు,385లో 12.73 ఎకరాలు,387/1లో 5.57 ఎకరాలు ఉన్నా యి. కురుకూరులో సర్వే నెంబరు 350/3లో 5.76 ఎకరాలు,426లో 9.37 ఎకరాలు ఉన్నాయి.

ఆడాళ్లు..జోహార్లు!

జిల్లాలో ఘనంగా మహిళా దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్యావ్యాప్తంగా మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలంతా ఒక చోటకు చేరుకుని పండగలా చేసుకున్నారు..నిర్వాహకులు ఆడాళ్లు మీకు జోహార్లు అంటూ అభినందనలు తెలియజేశారు.. రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం జిల్లా ఉద్యోగుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వ హించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. మహిళల ప్రాధాన్యతను పెంచుతూ సమానత్వం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చాలా మార్పులు తీసుకువస్తున్నాయన్నారు. జిల్లాలో మహిళా రక్షక్ ఏర్పాటు చేసిన ఎస్పీ నరసింహకిశోర్ అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమం రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారన్నారు. నన్నయ వైస్ చాన్సలర్ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మహిళ పట్ల వివక్షతను కుటుంబ వ్యవస్థ నుంచి పారద్రోలినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ప్రతి తల్లి తన కోడలని కూతురుగా.. ప్రతి కోడలు తన అత్తను తల్లిగా చూసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహిళలు ఆకాశంలో సగం అన్నారు. ఏ రంగంలోనైనా మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడగలరన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మంలో మహిళలకు ఇచ్చిన గౌరవం, ప్రాధాన్యత.. కాలక్రమంలో వక్రభాష్యంగా మార్చిన పరిణామాలను పురాణ ఇతిహాసాలతో వివరించారు.కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ తన విజయం వెనుక ముగ్గురు స్త్రీలు ఉన్నారని చెప్పారు. తన తల్లి, భార్య, కుమార్తె అన్నారు. కార్పొరేషన్‌లో మహిళా పారిశుధ్య కార్మికుల సేవలు సదా అభినందనీయమన్నారు.డీఎస్పీ భవ్యశ్రీ మాట్లాడుతూ మహిళల రక్షణకు మేమున్నామన్నారు. ఎటువంటి సహాయం కావాలన్నా సంప్రదించాలన్నారు.తొలుత కలెక్టర్ ప్రశాంతి, నన్యయ్య వీసీ ప్రసన్నశ్రీని ఘనంగా సత్కరించారు. కలెక్టర్‌కు ఒక చీరను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మహిళా దినోత్సవ బహుమతిగా అందించారు. సభా వేదికపై విద్యార్థినులు నృత్యప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో 77 మందికి అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే..
క్యాన్సర్‌ను జయించవచ్చు : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ నివారణకు స్ర్కీనింగ్ పరీక్షలు ముఖ్యమని..మహిళలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్‌ను జయించవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ప్రాథమికంగా గుర్తిస్తే తదుపరి చికిత్సలు సులభతరం అవుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా మహిళల్లో క్యాన్సర్ ముందస్తు గుర్తింపనకు సీఎస్ఆర్ కార్యకలాపాల్లో భాగంగా జీఎస్ఎల్ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో జీఎస్ఎల్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ తరుణ్ గోగినేని,డాక్టర్ సింధు తదితరులు పాల్గొన్నారు.

భౌ బోయ్!

ఆవు దూడపై కుక్కల దాడి





పారిశుధ్య సిబ్బంది సపర్యలు

ఆంధ్రజ్యోతి చెప్పింది అక్షరసత్యం.. అయినా నేటికీ చర్యల్లేవ్.. కుక్కల దాడులతో జనం బెంబేలెత్తిపోతు న్నా పట్టించుకునేవారేలేరు.. జిల్లా వ్యాప్తంగా కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని.. జనం బెంబేలెత్తిపోతున్నారని గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది.. అయినా అధికా రుల్లో మాత్రం కదలికలేదు. ఎండాకాలం కావడంతో కుక్కలు దాడులకు తెగబడుతున్నాయి.. కొవ్వూరు గౌతమినగర్‌లో శనివారం కుక్కల దాడిలో ఒక ఆవుదూడ తీవ్రగాయాల పాలైంది.. అటుగా వెళుతున్న వారు గమనించి మునిసిపల్ ఛైర్మన్‌కు సమాచారం అందించారు.. ఆమె సూచనల మేరకు పారిశుధ్య సిబ్బంది కాపాడారు.. ఈ రోజు ఆవుదూడ అయ్యింది.. రేపు మనిషైనా ఆశ్చర్యపోనక్కర్లెద్దు..అయ్యా అధికారులు ఇకనైనా మేల్కొండి.. - కొవ్వూరు

జగన్ హయాంలో పోలవరం ధ్వంసం

పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు

రాజమహేంద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టు ధ్వంసమైందని ఆలిండియా పీసీసీ మాజీ అధ్యక్షుడు , రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో విఫలమైందని, సూపర్ సిక్స్ దకాటయిందని ఎద్దేవా చేశారు. ఇవాళ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని చెబుతున్నారని, కానీ ఎన్నికల ముందు ఈవిషయం తెలియదా అని ప్రశ్నించారు. ఏపీలో హామీల అమలుకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా అరిగెల అరుణ కుమారి,చామర్తి లీల, జర్నలిస్ట్ విశాలాక్షిని సన్మానించారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పార్టీనేతలు బాలేపల్లి మురళీధర్, బోడా వెంకట్, కొవ్వూరి శ్రీనివాస్, బెజవాడ రంగారావు, దేవత సుధాకర్, చింతాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 618 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షకు శనివారం ఏకంగా 618 మంది గైర్హాజరయ్యారు. గణితం, ఐబీ, జంతుశాస్త్రం-1, చరిత్ర-1, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షకు 618 మంది గైర్హాజరైనట్టు ఇంటర్మీడియట్ విద్య జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఇప్పటి వరకూ నిర్వహించిన ఏపరీక్షలోనూ ఇంత ఎక్కువ మంది గైర్హాజరు కాలేదు.. దీనిపై అధికారులు దృష్టి సారించారు.

జూన్‌లో కార్పొరేషన్ ఎన్నికలు

- ఇక నుంచి మీ పన్నులు మీకే
- ఏప్రిల్ ఒకటి నుంచి అమలు
- భవన అనుమతులు సులభతరం
- మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో వసూలు చేసే పన్నులు ఎక్కడికక్కడ వినియోగించుకునే విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఆయన టౌన్ ప్లానింగ్, రుడా, రెవెన్యూ విభాగాల అధికారులతో సమీక్షించారు. మునిసిపాలిటీలకు వచ్చే ఆదాయాన్ని వాటికే చెందేలా సీఎం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా మునిసిపాలిటీ ,రుడా పరిధిలో భవనాలు, లేఅవుట్లకు అనుమతులు త్వరితగతిన జారీ చేస్తామన్నారు.ఐదు అంతస్తులు, 15 మీటర్ల ఎత్తులో నిర్మించే భవనాలకు స్వీయ ధ్రువీకరణ ద్వారా అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనుమతులన్నీ చాలా సులభతరం చేశామన్నారు.రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల టీడీఆర్ స్కామ్ జరిగిందన్నారు. దీనిపై విచారణ జరుగుతుందన్నారు.విశాఖపట్నంలో విజిలెన్స్, సీఐడీలకు అప్పగించారని చెప్పారు. గోదావరి పుష్కరాలరు 29 నెలల సమయం ఉందని దీనికి సీఎం చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారని చెప్పారు. త్వరలో పుష్కరాలపై సమావేశం నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో వేస్ట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను 2014-19లో ప్లాన్ చేశామని అటుపై వచ్చిన వైసీపీ నిర్వీర్యం చేసిందని చెప్పారు. ఇప్పుడు మళ్లీ దృష్టి సా రించామన్నారు. ఒక్కో ప్లాంట్‌కు రూ.350 కోట్ల నుంచి రూ. 400 కోట్లతో ఖర్చవుతుందన్నారు. రాజమహేంద్రవరం-కాకినాడ, నెల్లూరు -తిరుపతి మధ్యలో, రాయలసీమలోను ఈ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మునిసిపాలిటీల్లో పన్నులకు సంబంధించి వడ్డీ మాఫీ పై పది రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జూన్‌లో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్డీవో కృష్ణనాయక్ పాల్గొన్నారు.

తాడిపూడి మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- ఐదు కుటుంబాలకు రూ.25 లక్షల సీఎంఆర్ఎఫ్ అందజేత
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తాడిపూడి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో ఇటీవల గోదావరిలో ప్రమాదవ శాత్తు పడి మృతిచెందిన ఐదుగురు యువకుల కుటుం బాలను శనివారం పరామర్శించారు. అనంతరం ప్రభుత్వం తరపున సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మంజూరైన చెక్కులను అంద జేశారు. అందివచ్చిన కుమారులు మృత్యువాత పడితే ఆ బాధ ఎలా ఉంటుందో అర్థం చేసుకోగలనన్నారు.మీకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నా రు. మృతిచెందిన ఐదుగురు యువకుల చివరి కార్యక్రమాన్ని గ్రామస్తు లందరూ ఏకమై ఒకే చోట ఏర్పాటు చేయడంతో చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులర్పించారు. టీడీపీ యువగళం సభ్యులు ఒక్కొక్క కుటుం బానికి రూ.25 వేలు చొప్పున అందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే టివి రామారావు యువకుల కుటుంబాలను పరామర్శించి జనసేన నాయకులు సేరించిన లక్షా 50 వేలు అందించారు.ఈ కార్యక్రమంలో జొన్నల గడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, సూరప నేని చిన్ని, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, నామా కొండ బాబు, నామన పరమే శ్వరరావు,అనపర్తి ప్రసాదు, ఎంపీటీసీ వీరా హరిబాబు, అచ్యుతరాయుడు, పూలపల్లి బాలకృష్ణ, చౌటపల్లి శివ, దార్ల నాగలక్ష్మీ ప్రసాద్, మంచిగడ్డ మురళీ పాల్గొన్నారు.



మృతిచెందిన యువకుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



మహిళలకు మాత్రమే..

ఒక్కరోజు ఉచిత బోటు ప్రయాణం

యానాం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వం పుదుచ్చేరిలోని మహిళలకు ఒక్కరోజు ఉచిత బోటు ప్రయాణం కల్పించింది. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి ఆదేశాల మేరకు పర్యాటకశాఖ ఆధీనంలో ఉన్న బోట్‌హౌస్‌లో ఈ సౌకర్యం కల్పించారు. దీంతో యానాం పర్యాటకశాఖ ఆధీనంలోని సీగల్స్ బోటుహౌస్‌లో మహిళలకు ఉచిత బోటు షికారు అవకాశం కల్పించారు. పలువురు మహిళ న్యాయవాదులు, టీచర్లు, ప్రజలతో పాటు బీచ్ పర్యాటనకు వచ్చిన మహిళలు యానాం గౌతమీ గోదావరిలో బోటులో విహరించారు. కార్యక్రమాన్ని యానాం పరిపాలనాధికారి మునిస్వామి,సీగల్స్ మేనేజర్ మురళిధరన్ పర్యవేక్షించారు.


యానాం గోదావరి బోటులో విహరిస్తున్న మహిళలు

14న పండుగలా జనసేన ఆవిర్భావ సభ

కాకినాడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రారంభించిన మంత్రి నాదెండ్ల


కాకినాడలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభను కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం చిత్రాడ గ్రామంలో ఈనెల 14న పండుగలా నిర్వహిస్తామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. సభకు వచ్చేవారికి ఏవిధమైన ఇబ్బందులు రాకుండా చూసుకునేందుకు వివిధ కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు ఎప్పటికప్పుడు సమన్వయం చేసేందుకు కాకినాడలోని కుళాయి చెరువు ప్రాంగణంలో ఉన్న గోదావరి కళాక్షేత్రంలో కంట్రోల్ రూమ్‌ను మంత్రి నాదెండ్ల శనివారం ప్రారంభించారు. ఆవిర్భావ సభకు వచ్చే ఇరు రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల జన సైనికులు, వీరమహిళలు నాయకులు, పవన్‌కల్యాణ్ అభిమానులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఎప్పటికప్పుడు ఈ కంట్రోల్ నుంచి తమ అధి నాయకుడు పవన్‌తో సహా అందరూ పర్యవేక్షిస్తారన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ ఇప్పుడిప్పుడే రాక్షక పాలన నుంచి విముక్తి చెంది ఊపిరి పీల్చుకుంటున్నారన్నారు. తమ పార్టీ ఆవిర్భావ సభ ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలుస్తుందన్నారు. పార్టీలో ఉన్న ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి శ్రమిస్తున్నారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత 13ఏళ్లలో పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరినీ గుర్తుపెట్టుకుని సముచిత న్యాయం చేస్తామన్నారు. సభకు 10 నుంచి 15లక్షల మంది కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గ ప్రజలు పవన్‌కు అద్భుతమైన విజయాన్ని అందించారని, ఈ సభలో వారికి కృతజ్ఞతలు తెలియజేస్తామన్నారు. విచ్చేసే అభిమానులు, కార్యకర్తలు, నాయకులందరికీ ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకూడదనే లక్ష్యంతో 14 కమిటీలు ఏర్పాటు చేశామని, అవి నిరంతరం పర్యవేక్షిస్తాయన్నారు. సభలో భవిష్యత్తు కార్యాచరణపై అభివృద్ధి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఇతర ఎమ్మెల్యేలు బత్తుల బలరామ కృష్ణ, నిమ్మల జయకృష్ణ, లోకం మాధవి, కొత్తపల్లి సుబ్బారాయుడు, సివిల్ సప్లై ఛైర్మన్ తోట సుధీర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజ మార్గం

పీడీజే గంధం సునీత



ఇన్సూరెన్స్ కంపెనీ పరిహార చెక్కు నమూనాను బాధితులకు అందజేస్తున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజ మార్గమని.. తద్వారా కేసులను పరిష్కరించుకుంటే కోర్టుల పై భారం తగ్గుతుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాజమహేంద్రవరం డీఎల్ఎస్ ఏలో లోక్ అదాలత్‌ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో సుమారు 80 వేల కేసులు పెండింగ్‌లో ఉండగా ఈ దఫా 10 వేల కేసులను లోక్ అదాలత్‌కి తగినవిగా గుర్తించామని, వాటిలో 5916 కేసులు పరిష్కరించినట్టు చెప్పారు. కక్షిదారులకు కోర్టు ఫీజులను కూడా తిరిగివ్వడం జరుగు తుందన్నారు. ప్రజల్లో లోక్ అదాలత్‌పై మరింతగా అవగాహన పెంచడం ద్వారా సత్వర న్యాయం జరిగేలా చూడడం సామాజిక బాధ్యత అని పీడీజే పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 42 న్యాయపీఠాల ద్వారా రూ.18.33 కోట్ల పరిహారానికి సంబంధించి అవార్డు అందజేశామన్నారు. కార్యక్రమంలో 1వ ఏడీజే ఆర్.శివ కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ ఉన్నారు.

మహిళా దినోత్సవం రోజున..

మెడపై నరికేశాడు!

యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడు

ముమ్మిడివరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం రోజున ఓ యువతిపై యువకుడు కత్తితో దాడి చేసి మెడపై నరికిన సంఘటన ముమ్మిడివరం మండలం అనాతవరంలో జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరం ఎదురుమూడి పుంతలో పంతగంటి జయరామకృష్ణ, చాట్ల మాలతి పక్కపక్కన ఇళ్లల్లో ఉంటున్నారు. జయరామకృష్ణ వివాహితుడు కాగా భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మాలతి కూడా వివాహిత. భర్త బుల్లియ్య ఉపాధి నిమిత్తం ఏలూరులో చెరువుల వద్ద ఉంటున్నాడు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే శనివారం మధ్యాహ్నం మాలతి ఇంటి నుంచి బయటికి వెళ్తున్న సమయంలో చుట్టుపక్కల పిల్లలంతా ఆడుకుంటూ అల్లరి చేస్తుండగా వారిని ఆమె గట్టిగా మందలించింది. ఆ సమయంలో జయరామకృష్ణ ఇంట్లో నుంచి కత్తితో వచ్చి ఆమె మెడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అపస్మారక స్థితికి వెళ్లడంతో మాలతిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే గతంలో ఇరుగుపొరుగువారు ఎవరు గొడవ పడినా జయరామకృష్ణకు కిట్టేది కాదని, గట్టిగా మాట్లాడుకున్నా, గొడవపడినా ప్రశాంతంగా ఉండాలని వారిని హెచ్చరించేవాడని, ఈ క్రమంలోనే అల్లరిచేస్తున్న పిల్లలను మందలిస్తున్న మాలతిపై ఉద్రేకంతో కత్తితో మెడపై దాడి చేశాడని పోలీసులు పేర్కొంటున్నారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి ఇరుగుపొరుగువారిని విచారించి ఆధారాలు సేకరించారు. క్లూస్‌టీమును రప్పించి ఆధారాలు సేకరించారు. నిందితుడు జయరామకృష్ణను అదుపులోకి తీసుకుని దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మాలతి ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతుంది.


దాడిలో గాయపడిన యువతి


దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ మోహన్ కుమార్, ఎస్ఐ జ్వాలాసాగర్

లారీని ఢీకొని యువకుడి మృతి

ఎక్సైజ్ అధికారులు వెంటపడడంతో ప్రమాదం జరిగినట్టు బంధువుల ఆరోపణ

సుంకరపాలెం ఎక్సైజ్ చెక్‌పోస్టు ముట్టడి


లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం


మృతిచెందిన కోట శ్రీరామ్ (ఫైల్)

తాళ్లరేవు/జీజీహెచ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం యానాం-ద్రాక్షారామ రహదారిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరప మండలం అడవిపూడి గ్రామానికి చెందిన కోట శ్రీరామ్(21) కాకినాడ ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై యానాం-ద్రాక్షారామ రోడ్డులో వెళ్తుండగా ఇంజరం వద్ద వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. దీంతో యువకులకు తీవ్రగాయాలయ్యాయి. కోట శ్రీరామ్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మరో విద్యార్థి చికిత్స పొందుతున్నాడు. అయితే సుంకరపాలెం ఎక్సైజ్ చెక్‌పోస్టు అధికారులకు ఆ యువకులు మద్యం తరలిస్తున్నారన్న అనుమానం వచ్చి వారి వెంటపడిన కారణంగా యువకులు వేగంగా వెళ్లి లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని, అధికారుల నిర్లక్ష్యంతో నిండుప్రాణం బలైపోయిందని బంధువులు శనివారం రాత్రి సుంకరపాలెం చెక్‌పోస్టును ముట్టడించి యువకుడి మృతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కోరంగ పోలీసులు కేసు నమోదుచేశారు.

చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌ల ఏర్పాటు

మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ

కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో భూముల పరిశీలన


బలభద్రపురంలో స్థల వివరాలను తెలుసుకుంటున్న మంత్రి

బిక్కవోలు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. దీనిలో భాగంగా ప్లాంట్ నిర్మాణం కోసం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం శివార్లలో జిల్లా పరిషత్‌కు సంబంధించిన 12 ఎకరాల భూములను, బలభద్రపురంలోని ఏపీ ఇండస్ట్రియల్ భూములు 34 ఎకరాలను ఆయన శనివారం పరిశీలించి మాట్లాడుతూ రాజమహేంద్రవరం- కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు చుట్టు పక్కల మున్సిపాలిటీల నుంచి చెత్తను కొత్తగా ఏర్పాటు చేసే ప్లాంట్‌కు తరలించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా ప్లాంట్ ఏర్పాటుకు బలభద్రపురం, కాపవరం గ్రామాల్లోని జడ్పీ, ఏపీ ఇండస్ట్రియల్ భూములను పరిశీలించినట్టు చెప్పారు. ప్లాంట్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులను తహశీల్దార్ సత్యకృష్ణ, రాజమహేంద్రవరం మున్సిపాలిటీ ఈఈ-2 మాధవిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటు చేసే క్రమంలో చుట్టు పక్కల మున్సిపాలిటీలకు అనుకూలంగా ఉండేలా స్థలాన్ని అన్వేషిస్తున్నామని, అందుకు మున్సిపల్ శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. సీఎం చంద్రబాబు ఆలోచనలతో స్వచ్ఛ ఆంధ్ర సాధన దిశగా కసరత్తు జరుగుతోందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే ప్లాంట్‌లో 20 మున్సిపాలిటీల నుంచి సేకరించిన వ్యర్థాల నుంచి సంపద సృష్టి, విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్టు మంత్రి నారాయణ వివరించారు.

ఆకట్టుకున్న 'ఎడారిలో వాన చినుకు'

గొల్లప్రోలు రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చిన్నచూపు చూస్తున్నారు నేటి తరం పిల్లలు. ఆప్యాయతలు కనుమరుగవుతున్నాయి. అటువంటి వారికి బుద్ధిచెప్పిన దంపతుల ఇతి వృత్తాన్ని ఎడారిలో వాన చినుకు నాటకం ద్వారా కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు కాకినాడ శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ కళాకారులు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణాకళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటకాల పోటీల్లో భాగంగా తొలిరోజు ప్రదర్శించిన ఈ నాటకం అందరిని ఆకట్టుకుంది. ఈ నాటకాన్ని సారదా ప్రసన్న రచించగా, సీహెచ్ మహేష్ దర్శకత్వం వహించారు.


నాటకంలోని ఓ దృశ్యం

ఆరో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- రంప మన్యం ఆశ్రమ పాఠశాలలో ఘటన
- ఆరా తీసిన ఎమ్మెల్యే శిరీషదేవి
- విచారణకు ఆదేశించిన కలెక్టర్


మృతిచెందిన గిరిజన విద్యార్థిని

రంపచోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం వాడపల్లి ఆశ్రమోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న దోరి అశ్వని(11) శనివారం పాఠశాల అనుబంధ వసతిగృహంలోనే ఆత్మహత్యకు పాల్పడింది. దీని వివరాలిలా ఉన్నాయి. ఈ పాఠశాలలో ఉదయం అల్పాహారం తీసుకున్న అనంతరం వసతిగృహంలోకి వెళ్లి చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందిందని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తెలిపారు. హుటాహుటిన విద్యార్థినిని వాడపల్లి ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా సదరు విద్యార్థిని తన ఆత్మహత్యకు కారణాలను వివరిస్తూ ఒక లేఖను కూడా రాసి విడిచిపెట్టినట్టు తెలుస్తోంది. విషయం తెలిసిన వెంటనే రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వాడపల్లి ఆశ్రమ పాఠశాలకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఇతర విద్యార్థినులతో మాట్లాడి సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు బాధాకరమని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీడియాలో ఈ గిరిజన విద్యార్థిని ఆత్మహత్య ఘటన ప్రసారం అవుతుండడంతో అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్ తక్షణం స్పందించి విచారణకు ఆదేశించారు. అనంతరం రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పాఠశాలకు వెళ్లి ప్రాథమిక విచారణ జరిపారు. అత్యవసరంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ ఘటనపై రంపచోడవరం పోలీసు స్టేషన్‌లో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదై దర్యాప్తు ప్రారంభమైంది. గిరిజన బాలిక మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.


పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సీతారామచంద్రస్వామి జీర్ణోద్ధరణ మహోత్సవంలో చిన్నజీయర్‌స్వామి



జీర్ణోద్ధరణ కార్యక్రమానికి విచ్చేస్తున్న చిన్నజీయర్‌స్వామి, ఉత్సవమూర్తుల విగ్రహాలను చూస్తూ...

సర్పవరం జంక్షన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సర్పవరంలో గత 3 రోజులుగా నిర్వహిస్తోన్న హనుమ, లక్ష్మణ సహిత శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహోత్సవ కార్యక్రమానికి శనివారం చిన్నజీయర్‌స్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా భీమవరం త్రిదండి చిన్న రామచంద్రజీయర్ స్వామి, గోవిందా జీయర్, త్రిదండి అహోబిల రామానుజజీయర్‌స్వామిల ఆధ్వర్యంలో స్వామి వారికి శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, చతు:స్థానార్చన, తత్వత్వ్యాస హోమం, యంత్రస్థాపన, బింబస్థాపన, నివేదన, పూర్ణాహుతి, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి వంటి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తుల సంప్రోక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం సమీపంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మి భావనారాయణస్వామి ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు, ఆలయ పురాతన విశిష్టతను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పురాణం వెంకటాచార్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జీర్ణోద్ధరణ మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీనారసింహ ఇష్టి, చతు:స్థానార్చన, గోపూజ, సుందరకాండ పారాయణ, దివ్య ప్రబంధ పారాయణం, సంక్షేప రామాయణ హవనం, మూల మంత్ర, మూర్తి మంత్ర హవనాలు, పూర్ణాహుతి, మంగళాశాసనం వంటి పూజలు జరిగాయి.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

రూ.58 లక్షల ఆదాయం


ఆలయంలో పోటెత్తిన భక్తులు


వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాల బోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో 7 ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించి తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. మహిళా దినోత్సవం, రెండవ శనివారం సెలవు కావడంతో వేలాది మంది భక్తులు వాడపల్లి తరలివచ్చారు. సుమారు 60వేల మంది స్వామిని దర్శించుకోగా 25వేల మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు అధికారులు అంచనా వేశారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.58 లక్షల ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని విశాఖ జిల్లా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. స్వామివారి చిత్రపటాన్ని ఈవో అందించారు.


పెందుర్తి ఎమ్మెల్యే రమేష్‌బాబు కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

శృంగారవల్లభ స్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి గ్రామంలో తొలి తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవీ సమేత శృంగారవల్లభస్వామి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని సుమారు 20వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి రూ.3,55,197 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

బాలబాలాజీకి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తుల కోలాహలంగా మారింది. వేకువజామున అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అర్చకులు ఉభయ దేవేరులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.3,36,594 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 5వేల మంది దర్శించుకుని నిత్యాన్నదాన పథకంలో 3వేలమంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు పేర్కొన్నారు.

నేటి నుంచి కోరుకొండలో..

నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

తీర్థానికి తరలిరానున్న భక్తులు


కోరుకొండ కొండపైన స్వయంభుగా వెలిసిన నరసింహస్వామివారు

కోరుకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నాయి. పాల్గుణశుద్ధ దశమి ఆదివారం సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణతో కార్యక్రమాలు వైకానస ఆగమనం ప్రకారం ప్రారంభమవుతాయి. ఈనెల 10వ తేదీ సోమవారం ఒంటి గంటకు రథోత్సవం, రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం. 11వ తేదీ మంగళవారం రాత్రి గరుడ వాహనంసేవ, 12వ తేదీ బుధవారం రాత్రి 7గంటలకు స్వామివారి సదస్యం, రాత్రి 9 గంటలకు హనుమద్వాహనంపై గ్రామోత్సవం, 13తేదీ గురువారం రాత్రి 8 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, శ్రీరంగరాజ స్వామి ఆలయంలో రాత్రి 8 గంటలకు రంగనాధ స్వామి కల్యాణం, 14వ తేదీ శుక్రవారం దేవుని కోనేరు వద్ద చక్రతీర్థం, సాయంత్రం ధ్వజ అవరోహణ, అద్దాల సేవ, ఊంజల సేవ, రాత్రి 9గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవం, 15వ తేదీ శనివారం రాత్రి స్వామి వారికి శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తీర్థానికి భక్తులు తరలి వస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానం దత్తత ఆలయంగా ఉన్న నరసింహ స్వామి మహోత్సవాలను కనుల పండువగా నిర్వహించాలని అన్నవరం ఆలయ వ్యవస్థాపక కుటుంబీకుడు ఐవీ రోహిత్ అధికారులకు సూచించారు. రంగరాజభట్టర్ స్వీయ పర్యవేక్షణలో వైఖానస ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవనకుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకస్వాములు ఉత్సవాలు నిర్వహిస్తారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

కడియంలో మహిళా దినోత్సవ ర్యాలీ



ప్రతి రైతు ప్రకృతి సాగును అవలంబించాలి

కేవీకే హెడ్ నాయుడు.. వివిధ కషాయాలు, విత్తన గుళికల తయారీపై శిక్షణ

రాజానగరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సాగులో రసాయన పురుగుమందుల అవశేషాలు లేని పంటల సాగును ప్రోత్సహించే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి రైతు అవలంబించాలని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కలవచర్ల కేవీకేలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రకృతి వ్యసాయంలో క్రిమి సంహారణకు వాడే వివిధ కషాయాలు, విత్తన గుళికల తయారీపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు సాగులో అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల వాటిల్లే నష్టాలను రైతులు వివరించారు. దీనిలో భాగంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం సభ్యుడు వెంకట్రావు బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, దేశపత్ర కషాయం, నీమాస్త్రం కషాయాల గురించి వివరిస్తూ, వాటి తయారీని ప్రదర్శించారు. విత్తన గుళికల తయారీ, ఆవశ్యకతను ఏపీసీఎన్ఎఫ్ సభ్యుడు గోపి వివరించారు. కార్యక్రమంలో కేవీకే పశుసంవర్ధక శాఖాధికారి బి.నాగేశ్వరరెడ్డి, సస్యరక్షణాధికారి సంజయ్ హెగ్డే, గృహ విజ్ఞానాధికారి విజయవర్ధన్, కలవచర్ల, సీతారాంపురం, నరేంద్రపురం, నాగులపల్లి, యు.కొత్తపల్లి, కోటికేశవరం గ్రామాలకు చెందిన 50 మంది రైతులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల సముదాయంలో అపారిశుధ్యం

సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ ▸ బొమ్మూరులో ప్రజా చైతన్య యాత్ర

ధవళేశ్వరం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): అపారిశుధ్య పరిస్థితుల మధ్య బొమ్మూరులోని టిడ్కో, వాంబే గృహవాసులు జీవించాల్సి వస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం సాయంత్రం నాయకులు టిడ్కో, వాంబే గృహ సముదాయాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా టి.అరుణ్ మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో ఏ బ్లాక్ చూసినా దట్టమైన అటవీప్రాంతం మధ్య ఉన్నట్లుగా ఉందని, పారిశుధ్యం అధ్వానంగా తయారైందని విమర్శించారు. కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. ఎమర్జెన్సీ కోసం ఇప్పటికీ ప్రైమరీ హెల్త్ సెంటర్ కూడా ఏర్పాటు చేయ కపోవడం దారుణమన్నారు. ఈ గృహాల్లో నివసిస్తున్న వారికి తాగునీటి సౌకర్యం కల్పించాలని, పరిస్థితులు మెరుగుపరచాలని అధికారులను డిమాండ్ చేశారు. కె.రామకృష్ణ, ఎస్ఎస్ మూర్తి, ఐ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చిత్రకారుడు దామెర్ల రామారావు జయంతి



దామెర్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మాదేటి రాజాజీ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో, సీపీ బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి ఆధ్వర్యంలో దామెర్ల రామారావు 128వ జయంతిని శనివారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది మద్దూరి సుబ్బారావు.. రామారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తూ, దామెర్ల ఆర్ట్ గ్యాలరీని చిత్రకారులు పరిరక్షించే బాధ్యత నుంచి ప్రభుత్వం పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. మాదేటి రవి ప్రకాష్, వరదా వెంకటరత్నం మాట్లాడుతూ మాదేటి, రాజాజీల చలవతోనే దామెర్ల ఆర్ట్ గ్యాలరీ స్థాపితమైందన్నారు. పలువురు చిత్రకారుల చిత్రాలతో ఏర్పాటు చేసిన చిత్ర కళా గ్రూప్ షోను పలువురు తిలకించారు. కార్యక్రమంలో ఎన్‌వీవీఎస్ లక్ష్మి, కరణం నూకరాజు, వానపల్లి, టి.రవికాంత్ పాల్గొన్నారు.

రాజానగరంలో లారీ బోల్తా

నడిచి వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు

రాజానగరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రి వద్ద శనివారం ఒక లారీ బోల్తా పడింది. రాజమహేంద్రవరం వైపు నుంచి వైజాగ్ వైపుగా వెళ్తున్న లోడు లారీ జీఎస్ఎల్ సమీపంలోకి వచ్చేసరికి డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదవశాత్తూ అదుపు తప్పి రోడ్డు మార్జిన్ దాటుకుని వెళ్లి బోల్తా పడింది. ఇదే సమయంలో సమీపంలోని సుభిక్ష లాడ్జిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న తూర్పుగోనగూడెం గ్రామానికి చెందిన నూకతాటి సుబ్బారావు విధులు ముగించుకుని వెలుగుబంద రోడ్డు వైపుగా నడిచి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

ప్రమాదంలో విశ్రాంత ఏఎస్ఐ మృతి

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వాసంశెట్టి త్రిమూర్తులు(66) ఏఎస్సైగా ఉద్యోగ విరమణ పొంది స్వరూప్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా శ్రీరాంపురం రోడ్డులో ఆటో ఢీకొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బొమ్మూరు పోలీసులు తెలిపారు.

ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే వాసు



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రజలందరికి సంపూర్ణ ఆరోగ్యం కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులో తన కార్యాలయంలో శనివారం 19 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.30 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఇప్పటి వరకు తన నియోజకవర్గంలో సుమారు రూ.1.10 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం కోసం సీఎం చంద్రబాబు సంకల్పించారని, పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, కంటిపూడి శ్రీనివాస్, కంటిపూడి రాజేంద్రప్రసాద్, బొర్రా చిన్ని, మొకమాటి సత్యనారాయణ, కేబుల్ మురళీ, చొప్పర్ల భద్రరావు పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన గురుకుల్ చైర్మన్లు

కడియం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్వామినారాయణ్ అంతర్జాతీయ గురుకుల్ ఆశ్రమం సాధు సుఖదేవ్‌వల్లభ్ శనివారం పుల్లా వీరవెంకట్రావు-సత్యదేవా నర్సరీని సందర్శించారు. చిలుకూరి బాలాజీ ఆలయం సమీపంలోని గురుకుల్ చైర్మన్ శ్రీకృష్ణచరణ్‌స్వామిజీ, మైసూర్ గురుకుల్ చైర్మన్ శ్రీమంత్రిదాస్‌స్వామిజీ విచ్చేసారు. మైసూర్ ఆశ్రమంలో మొక్కల పెంపకం, గార్డెన్ నిర్వహణకు కొన్ని రకాల మొక్కలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, ఎంపీటీసీ గొల్లపల్లి వేంకటేశ్వరరావు అన్నవరం దేవస్థాన ఈవో కె.రామచంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

త్వరలో బీజేపీలో చేరికలు

గోకవరం, మార్చి8(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో తన ఆధ్వర్యంలో బీజేపీలో చేరికలు ఉంటాయని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. గోకవరంలోని సీఎండీ ప్రాంగణంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామసేన ద్వారా జగ్గంపేట, రాజానగరం, రంపచోడవరం నియోజకవర్గాల్లోని ప్రజలకు సుమారు 18 రకాల సేవలను అందిస్తున్నట్టు చెప్పారు.

ఆర్టీసీ బస్టాండులో చలివేంద్రం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ, ఎర్నగూడెం జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని డిపో మేనేజర్ షేక్ షబ్బం ప్రారంభించారు.

చట్టాలపై అవగాహన అవసరం

నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

గోకవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ సూచించారు. గోకవరంలో శనివారం జరిగిన రాజా పబ్లిక్ స్కూల్ 45వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గంజాయి, సైబర్ క్రైమ్, మైనర్ డ్రైవింగ్ తదితర అంశాలపై తల్లిదండ్రులకు సూచనలు చేశారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు కరస్పాండెంట్ పి.సూర్యప్రకాశరావు, ఛైర్మన్ పి.రమానాగలక్ష్మి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, కంబాల శ్రీనివాసరావు, మంగరౌతు రాము పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం దళితుల పక్షపాతి

కడియం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దళితుల సంక్షేమానికి పాటు పడుతోందని ఎస్సీసెల్ నాయకులు అన్నారు. కడియపులంక వీరహనుమాన్ నర్సరీలో ఎస్సీసెల్ సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ మద్దా మణినిసత్కరించారు. కార్యక్రమంలో జల్లి కృపారావు, కనికెళ్ళ బుల్లియ్య, బొల్లాడి జాన్, విప్పర్తి శ్రీను, శీలం రవి, చిల్లి దాసు, పల్లి చిన్న పాల్గొన్నారు.

ఆడాళ్లు.. మీకు జోహార్లు

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- పలువురు మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు సత్కారాలు



రాజమహేంద్రవరంలో మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరించిన కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మన జాతికి ఎందరో నారీమణులు ఖ్యాతి తెచ్చారని, రాజకీయ, సినీ, సంగీతం, క్రీడలు ఇలా అనేక రంగాల్లో రాణిస్తున్నారని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలోని రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన వేడుకలకు ఎమ్మెల్యే విచ్చేసి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటూ విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సరైన భాగస్వామ్యం తప్పనిసరన్నారు. సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె కుటుంబాన్ని బలపరుస్తుందని, కుటుంబం బలంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్న పలువురిని నాసేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, ఐసీడీఎస్ సీడీపీవో టి.నాగమణి, తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవి తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో కలవచర్ల పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ మహిళా ఉద్యోగులను సన్మానించారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పలువురు నాయకులు పాల్గొన్నారు. గైట్ ఫార్మసీ కళాశాల విద్యార్థిని లాలిత్యకు వివేకానంద సేవాశ్రమం నుంచి మహిళా ధాత్రి పురస్కారం లభించింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట గుర్తింపు సొంతం చేసుకున్న మహిళలకు ఇటీవల కడప జిల్లాలోని ఓబులాపురంలో ఈ పురస్కారాలు అందజేశారు. లాలిత్య ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా ఆరోగ్యం, బాలికల శ్రేయస్సుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజు, ఎన్ ఎస్ఎస్ పీవో షేక్ మీరా, వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రన్, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

కడియం: మండల పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కె.రమేష్, సీఐ ఎ.వెంకటేశ్వరరావు, ఎంపీపీ వైవీ సత్య ప్రసాద్, కడియం ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయినీలు కె.జయలక్ష్మి, బి.సుధ, ఎంఈవోలు నాగేశ్వరరావు, మణికుమార్ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, జరుగుతున్న దాడులపై మాట్లాడారు. తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ అమ్మపాట, నారాయణుడు గొప్పవాడా? నారీ గొప్పదా? అనే కవిత అందర్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన 200 మంది మహిళలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: హుకుంపేటలోని గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో సౌత్‌జోన్ డీఎస్పీ ఎస్.భవ్యకిశోర్, డాక్టర్ పాసర్ల లక్ష్మీప్రసన్నలను పీఎంపీ అసోసియేషన్ మండలాధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తించడంతో పాటు లింగ సామానత్వాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందం, పి.చిన్నిమట్టా రమేష్, ఎ.సురేష్‌బాబు పాల్గొన్నారు. అలాగే ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర సమర యోధుల పార్కులో 12మంది మహిళా సమరయోధులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిరాజు శ్రీనివాస్, దేశిరెడ్డి బలరామనాయుడు, ఆర్.సాయిబాబా, జి.సునీల్ గౌతమ్ పాల్గొన్నారు. స్థానిక ఆదిత్య మహిళా కాలేజీలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ జీఎస్‌వీఏబీ ఎస్.మహలక్ష్మిని సత్కరించారు. శ్రీలత హాస్పిటల్స్ మేనేజింగ్ పార్టనర్ అనసూరి ప్రియాంక ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో జీవీఎస్ నాగేశ్వరరావు, బీహెచ్ రమాదేవి, కె.మహేశ్వరి, పి.సాయి పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు ఏవీకే చైతన్య, ఇ.ఏసురాణిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చైతన్య మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏసురాణి మాట్లాడుతూ లింగ వివక్ష చూపరాదని చంటిపాప నుంచి వృద్ధురాండ్ర వరకు మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే పురుషోత్తపట్నంలోని సాధన మహిళా మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి అధ్యక్షురాలు పసలపూడి సుజ్ఞానకుమారి అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళా సాధికారత, స్త్రీ శిశు సంక్షేమం సాధనలో మహిళలు ముందుకు సాగాలన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.

అనపర్తి: స్థానిక ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి మహిళా దినోత్సవానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రపంచ దేశాల మహిళలకు భారతీయ మహిళలు ఆదర్శమని అన్నారు. మరో అతిథి ఆదికవి నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోను ముందుండాలని, కృషి పట్టుదలతో విజయాలు వరిస్తాయని అన్నారు. మరో అతిథి ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్య మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ, డీఎస్పీ విద్యలతోపాటు వైద్యులు కర్రి బాంధవి, ఎం.రమాదేవి, ద్వారంపూడి వరలక్ష్మి, వివిధ శాఖల్లోని మహిళా ఉద్యోగులను సత్కరించారు. అనపర్తి ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను ఎమ్మెల్యే నల్లమిల్లి తిలకించారు. కార్యక్రమంలో సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల పరిధిలోని సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి జడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, ఎంపీడీవో గోవిందు విచ్చేశారు. ముందుగా ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా గోకవరం ఎన్నికవ్వడంతో సర్పంచ్ కొమరం శ్రావణి, సెక్రటరీ శిరీష, వార్డు మెంబరులను సత్కరించారు. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా గోకవరం ఎంపిక కావడంతో గ్రామంలో మహిళలు, బాలికల అభివృద్ధికి త్వరలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నామని ఎంపీడీవో చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పులపర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రధాని మోదీ వల్లే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభించాయన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జిల్లా మహిళా అధ్యక్షురాలు మద్దిపాటి స్వర్ణరజని, బొమ్ముల దత్తు మాట్లాడారు. కార్యక్రమంలో వీరమల్లు గంగాభవానీ, ఫణి సుహాసిని, చర్ల మృదుల, పద్మావతి రామానుజం, సీకే లక్ష్మి, మోహిని, మీనాక్షి పాల్గొన్నారు. స్థానిక నటరాజ్ రైతు బజార్‌లో నలుగురు డ్వాక్రా షాపుల మహిళలకు, ఆకు కూరలు విక్రయించే ఒక మహిళకు ఎస్టేట్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కారం చేశారు. మహిళల సేవలను కొనియాడారు. రాజమహేంద్రవరంలో పీవోడబ్ల్యు ఆధ్వర్యంలో కళాశాల బాలికల వసతిగృహం వద్ద పట్టణ నాయకులు పార్వతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పి.విజయ మాట్లాడారు. స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాటం చేయాలని, ఆధిపత్య పితృస్వామ్య భావజాలాన్ని వ్యతిరేకించాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, జ్యోతి, లలిత, కుమారి, కల్పన, నిర్మల పాల్గొన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, హత్యలు నేటికీ జరగడం బాధాకరమన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మజ్జి పద్మ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో మహిళల పాత్రపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యాలయ సూపరింటిండెంట్ ప్రసాద్, ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం మజ్జి పద్మను ఎంపీడీవో ఆధ్వర్యంలో సత్కరించారు. అయితే మండల ప్రత్యేకాధికారి జ్యోతితో పాటు పలువురు మహిళా అధికారులు హాజరు కాలేదు. అలాగే ఎమ్మెల్యే కార్యాలయంలో మజ్జి పద్మ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, మార్ని వాసుదేవరావు, మత్యేటి శివసత్యప్రసాద్ విచ్చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో దండమూడి ప్రమీల,పిల్లా తనూజ, కోటిపల్లి అమ్ములు, రాయుడు అలేఖ్య, కంచర్ల లక్ష్మి, యమున తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక రౌతు తాతాలు కళ్యాణ మండపంలో తెలుగు మహిళా పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీర్రాఘవమ్మ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దంపతులను నగర తెలుగు మహిళలు సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో మహిళ పట్ల మన ఆలోచన విధానం మారాలన్నారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు. వీర్రాఘవమ్మ మాట్లాడుతూ మహిళల ఆర్థిక ప్రగతికి కూటమి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. నగరంలోని 42 డివిజన్లకు చెందిన తెలుగు మహిళలను సత్కరించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషనులోని మహిళా సఫాయి కర్మచారులను స్టేషను సలహా కమిటీ సభ్యులు, రైల్వే అధికారులు సత్కరించారు. కాళ్లకు పువ్వులు జల్లి నమస్కరించి చీరలు, మిఠాయిలు అందజేశారు. మహిళలు ఏ రంగంలో అయినా నిబద్ధతతో పని చేస్తారని కొనియాడారు. స్టేషను పరిశుభ్రతలో మహిళా సఫాయి కర్మచారుల సేవలు కీలక భూమిక వహిస్తున్నాయన్నారు.

కోరుకొండ: స్థానిక మండల వనరుల కేంద్రంలో పలువురు మహిళా ఉపాధ్యాయులను ఎంఈవో టి.కుశలవ దొర, ఎంపీడీవో బత్తిన అశోక్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్కరించారు. వారి సేవలనుకొనియాడారు. వారికి మెమొంటోలు అందజేశారు.



రాజానగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల



సీతానగరంలో కేక్ కట్‌చేస్తున్న మహిళా ఉద్యోగులు



అనపర్తిలో నన్నయ వీసీ ప్రసన్నను సత్కరిస్తున్న ఎమ్మెల్యే



గోకవరంలో సర్పంచ్, సెక్రటరీలను సత్కరిస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు నిర్మల



బొమ్మూరులో టీడీపీ నాయకురాలు పద్మను సత్కరిస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరంలో డీఎస్పీ భవ్యను సత్కరిస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి అప్పారావు దంపతులను సత్కరిస్తున్న మహిళలు



రాజమహేంద్రవరంలో మహిళా సఫాయివాలాలను సత్కరించిన అధికారులు



కోరుకొండలో మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

నరసింహస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం మధ్యాహ్నం నరసింహస్వామి కల్యాణ మండపంలో ఆయన అర్చక స్వాములు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. భక్తులకు స్వామి వారి దర్శనం విషయంలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్‌కుమార్, తహసీల్దార్ సుస్వాగతం, సీఐ సత్యకిషోర్, ఎస్ఐ శ్రీనివాస్ బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, అన్నవరం దేవస్థానం అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు సౌకర్యవంతంగా పింక్ టాయిలెట్స్

రాజమహేంద్రవరంలో త్రీటౌన్ స్టేషన్ వద్ద ప్రారంభించిన కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరంలో నిర్మించిన గులాబి మరుగుదొడ్లు, ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళల కోసం రాజమహేంద్రవరంలో సౌకర్యవంతంగా ఏర్పాటు చేసిన గులాబి మరుగుదొడ్లను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా కోర్టు ఆవరణాన్ని ఆనుకొని రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన గులాబి మరుగుదొడ్డిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ మరుగుదొడ్లలో శానిటరీ నాప్ కిన్ అమ్మే యంత్రాన్ని ఏర్పాటు చేశారని, రూ.5 నాణెం వేస్తే శానిటరీ నాప్‌కిన్ వస్తుందన్నారు. మహిళలు విశ్రాంతి తీసుకోవడానికి కూడా తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ ఎ వినూత్న, ఈఈ మాధవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాతసోమాలమ్మ జాతర

రాజమహేంద్రవరం కల్చరల్,మార్చి 8(ఆంధ్రజ్యోతి):స్థానిక శ్యామలానగర్‌లో శ్రీ పాత సోమాలమ్మ జాతర ఈ నెల 9 నుంచి 13వరకు నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్తలు గొర్రెల సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు జరుగుతాయని చెప్పారు.

బ్రాంది షాపును వ్యతిరేకిస్తూ చినకొండేపూడిలో ఆందోళన

సీతానగరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి) మండలంలోని చినకొండేపూడిలో స్టేట్ బ్యాంకు సమీపంలో బ్రాందీ షాపును ఏర్పాటు చేయడానికి యాజమాన్యం ప్రయత్నిస్తుండడంతో స్థానికులు అడ్డుకున్నారు. గతంలో ప్రభుత్వం వైన్ షాపు ఏర్పాటు చేసినప్పుడే అభ్యంతరం తెలిపామని, కాని ప్రజల విన్నపాలను లెక్క చేయకుండా ఏర్పాటు చేశారని, దీని వల్ల చుట్టుపక్కల నివసిస్తున్న మహిళలు ఇబ్బందులకు గురయ్యారని, వైన్ షాపును ఇక్కడ ఏర్పాటు చేయడానికి వీలులేదని చెప్పారు. కాగా షాపు ఏర్పాటును విరమించుకున్నారు.



రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (ఆది)	సా.6.20
	సహరి (సోమ)	ఉ.4.54



నేటి నుంచి కోరుకొండ తీర్థం



నరసన్న బ్రహ్మోత్సవాలకు కోరుకొండ ముస్తాబైంది.. ఆదివారం నుంచి 15వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందిలేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8



ఇదీ సత్తా : రాజమహేంద్రవరం స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో మహిళా స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పిస్తున్న ఆంధ్రకేసరి యువజన సమితి మహిళలు



ఆనం కళాకేంద్రంలో మహిళా దినోత్సవానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, నన్నయ వీసీ ప్రసన్న శ్రీ చిత్రంలో ఎమ్మెల్యే వాసు.. హాజరైన ఉద్యోగినులు

అవకాశం ఇస్తే గుడిని.. గుడిలో లింగాన్ని మింగేసే ఘనులున్నారు.. కూర్చోవడానికి చోటిస్తే పడుకోవడానికి చోటడిగే ప్రబుద్ధులున్నారు.. ఎందుకంటే దేవుడి భూమిని లీజుకు తీసుకుని ఆక్రమించేసేవారు ఎక్కువైపోయారు.. తనది కాని భూమి కోసం న్యాయం చేయమని కోర్టులను ఆశ్రయిస్తున్నారు..అయినా అధికారులు పట్టించు కోకుండా వదిలేస్తున్నారు.. దీంతో దాతల ఆశయం నీరుగారిపోతోంది.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్.. ఈ పేరు కూడా ఇప్పటి తరానికి తెలియదు. కానీ రాజానగరంలో అన్నదాన సత్రానికి ఏకంగా 188.89 ఎకరాలు విరాళంగా ఇచ్చారు. ప్రస్తుతం ఆ భూములు సమస్యల్లో చిక్కుకున్నాయి. కౌలు రైతులు ఆ భూములు మావేనంటూ కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. జిల్లాలో ఈ ఒక్క సంఘటనే కాదు.. ఆలయ భూములను లీజుకు తీసుకుని ఆక్రమించేసేవారు ఎక్కువైపోయారు.



ఇటీవల రాజానగరంలో స్వాధీనం చేసుకున్న 25.16 ఎకరాల భూమి(ఫైల్)

గలీజుదారులు!

దాతల ఆశయాలకు తూట్లు

» ఆస్తులు ఘనం..ఆదాయం కనం
» వందేళ్లుగా వేలం పాటలే లేవు
» సత్రం భూములు అన్యాక్రాంతం
» 137 ఎకరాలు..రూ.16 లక్షలు
» అయినా శిస్తు చెల్లించని వైనం
» కోర్టులకు కౌలుదారులు
» మామూళ్ల మత్తులో అధికారులు
» కన్నెత్తిచూడని వైనం

రాజానగరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బాటసారులకు పట్టెడన్నం పెట్టాలనే సంకల్పంతో వందలాది ఎకరాల భూములను ధారాదత్తం చేసిన దాత ఆశయాలకు కొందరు స్వార్థపరులు తూట్లు పొడుస్తున్నారు. నామమాత్రపు శిస్తులు కూడా చెల్లించకుండా కౌలుదారులు కోర్టులను ఆశ్రయిస్తూ అధికారులను సైతం కోర్టు బోనుల్లో నిలబెడుతున్నారు. కాసులకు కక్కుర్తిపడుతున్న దేవాదాయ ధర్మాదాయ శాఖలోని కొంత మంది అధికారులు తప్పుడు సలహాలిస్తూ కౌలుదారులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దశాబ్దాల తరబడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉన్న వందలాది ఎకరాల అన్నదాన సత్రం భూములు కోర్టు కేసులతో మగ్గిపోతున్నాయి.

భూములపై లీజుదారుల కన్ను

శతాబ్దాల కిందట శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ అనే జమిందారు వాహన సౌకర్యాలు కూడా లేని రోజుల్లో మచిలీపట్నం నుంచి గుర్రం మీద పెద్దాపురం కప్పం వసూలుకు వెళ్లి వస్తూ రాజానగరంలో సేద తీరేవారు. ఆ సమయంలో ఈ ప్రాంతంలో దారినపోయే బాటసారులకు గుప్పెడు మెతుకులు పెట్టాలనే ఉద్దేశంతో రాజానగరంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. వందలాది ఎకరాలను అన్నదాన సత్రానికి సమకూర్చారు.కొన్నేళ్ల పాటు అన్నదానం సజావుగానే సాగింది. అయితే సత్రం సిబ్బందిపనితీరుతో పాటు బాటసారులు రావడం తగ్గింది.దీంతో సత్రం సిబ్బంది అన్నదానాన్ని అటకెక్కించి జేబులు నింపుకునే పనిలో పడ్డా రు. భూముల ధరలు పెరుగుతున్న తరుణంలో కొంతమంది లీజుదా రులు భూములపైనే కన్నేశారు.శిస్తులు చెల్లించ కుండా కోర్టులను ఆశ్రయిస్తున్నారు.



దాత జోగి జగన్నాథరావు పంతులు జమిందార్

సాగులో 137.78 ఎకరాలు

వందలాది ఎకరాల భూములను ధారపోసిన జమిందారు శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ వారి అన్న దాన (ఫీడింగ్) సత్రానికి సంబంధించిన 188.89 ఎకరాల భూములు సమకూర్చారు.వీటిలో 47.12 ఎకరాలు పేదల నివాస స్థలాలకు ప్రభుత్వం తీసుకుంది.పులిమేరులో 3.99 ఎకరాలు ఆక్రమణల్లో చిక్కుకున్నది.ప్రస్తుతం 137.78 ఎకరాలు కౌలు వ్యవసాయం కొనసాగుతుంది. వార్షికాదాయం రూ.16లక్షలకు మించి రావడం లేదు. ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి కౌలుదారులు,దేవాదాయశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్ల ఆదాయ కుంటుపడిపోతోందని ఆరోపిస్తున్నారు. కొంత మంది తక్కువ లీజు ఇస్తుంటే.. మరికొందరు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.మూడేళ్లకోసారి పాట నిర్వహించాల్సి ఉన్నా మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు చాలా ఏళ్లగా అటు వైపే చూడకపోవడం గమనార్హం. శతాబ్దాలుగా వేలం వేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.జిల్లా అధికారులైనా దృష్టి సారించారా అంటే అదీ లేదు. దాత ఆశయాలు నీరుగారుతున్నాయి.

ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి

పులిమేరు గ్రామంలోని 3.99 ఎకరాల భూమి ఆక్రమణలో ఉంది.దేవరపల్లి మండలం త్యాజంపూడిలోని ఉన్న 35 ఎకరా ల్లోని 27 ఎకరాలకు సంబంధించి కౌలుదారుడు శిస్తులు ఎగవేయడంతో కోర్టు వివాదంలో కొనసాగుతుంది. ఇటీవల రాజానగరంలోని 25.16 ఎకరాల భూమిని ఎండోమెంట్ అధికారులు స్వాధీ నం చేసుకుని బహిరంగ వేలం నిర్వహించారు. ఇదేవిధంగా అన్ని ప్రాంతాల్లో ఉన్న భూములకు బహిరంగ వేలం నిర్వహిస్తే మరింత ఆదాయం సమకూరుతుందని పలువురు రైతులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి దేవాదాయ ధర్మాదాయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూములు ఎక్కడెక్కడంటే...

ఈ సత్రానికి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా విలువైన పంట భూములు ఉన్నాయి.పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలో సర్వే నెంబరు 107లో 2.19 ఎకరాలు, సర్వే నెంబరు 108లో 4.11 ఎకరాలు, 109లో 3.3 ఎకరాలు,120లో 4.64 ఎకరాలు భూములు ఉన్నాయి. సర్వే నెంబరు 189లో 2.5 ఎకరాలు, 189లో 1.81 ఎకరాలు, 190లో 0.73 సెంట్లు, 193లో 1.45 ఎకరాలు, 98లో 0.98 ఎకరాలు భూములు ఉన్నాయి.రాజానగరంలో సర్వే నెం బరు 135లో 11.97 ఎకరాలు, 161/1లో 3.49 ఎకరాలు, 161/1లో 0.53 సెంట్లు, 164లో 3.08 ఎకరాలు, 165లో 3.54 ఎకరాలు, 20లో 2.87 ఎకరాలు, 27లో 5.48 ఎకరాలు, 28లో 7.10 ఎకరాలు, కలవచర్లలో సర్వే నెంబరు 342లో 14.11 ఎకరాలు రికార్డులో దఖలు పడి ఉన్నాయి. ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో సర్వే నెం బరు 242లో 4.54 ఎకరాలు, 252లో 2.96 ఎకరాలు, 342లో 2.11 ఎకరాలు, 345లో 0.74 ఎకరాలు, 348లో 7.22 ఎకరాలు, 350లో 1.99 ఎకరాలు, 364లో 6.38 ఎకరాలు, 365లో 6.90 ఎకరాలు, 629లో 2.39 ఎకరాలు, 632లో 2.78 ఎకరాలు ఉన్నాయి.దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామంలో సర్వే నెం బరు 245లో 35.05 ఎకరాలు,378/2లో 9.36 ఎకరాలు,385లో 12.73 ఎకరాలు,387/1లో 5.57 ఎకరాలు ఉన్నా యి. కురుకూరులో సర్వే నెంబరు 350/3లో 5.76 ఎకరాలు,426లో 9.37 ఎకరాలు ఉన్నాయి.

ఆడాళ్లు..జోహార్లు!

జిల్లాలో ఘనంగా మహిళా దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలంతా ఒక చోటకు చేరుకుని పండగలా చేసుకున్నారు..నిర్వాహకులు ఆడాళ్ల మీకు జోహార్లు అంటూ అభినందనలు తెలియజేశారు.. రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం జిల్లా ఉద్యోగుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వ హించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. మహిళల ప్రాధాన్యతను పెంచుతూ సమానత్వం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చాలా మార్పులు తీసుకువస్తున్నాయన్నారు. జిల్లాలో మహిళా రక్షక్ ఏర్పాటు చేసిన ఎస్పీ నరసింహకిశోర్ అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమం రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారన్నారు. నన్నయ వైస్ చాన్సలర్ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మహిళ పట్ల వివక్షతను కుటుంబ వ్యవస్థ నుంచి పారద్రోలినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ప్రతి తల్లి తన కోడలని కూతురుగా.. ప్రతి కోడలు తన అత్తను తల్లిగా చూసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహిళలు ఆకాశంలో సగం అన్నారు. ఏ రంగంలోనైనా మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడగలరన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మంలో మహిళలకు ఇచ్చిన గౌరవం, ప్రాధాన్యత.. కాలక్రమంలో వక్రభాష్యంగా మార్చిన పరిణామాలను పురాణ ఇతిహాసాలతో వివరించారు.కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ తన విజయం వెనుక ముగ్గురు స్త్రీలు ఉన్నారని చెప్పారు. తన తల్లి, భార్య, కుమార్తె అన్నారు. కార్పొరేషన్‌లో మహిళా పారిశుధ్య కార్మికుల సేవలు సదా అభినందనీయమన్నారు.డీఎస్పీ భవ్యశ్రీ మాట్లాడుతూ మహిళల రక్షణకు మేమున్నామన్నారు. ఎటువంటి సహాయం కావాలన్నా సంప్రదించాలన్నారు.తొలుత కలెక్టర్ ప్రశాంతి, నన్నయ్య వీసీ ప్రసన్నశ్రీని ఘనంగా సత్కరించారు. కలెక్టర్‌కు ఒక చీరను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మహిళా దినోత్సవ బహుమతిగా అందించారు. సభా వేదికపై విద్యార్థినులు నృత్యప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో 77 మందికి అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే..
కేన్సర్‌ను జయించవచ్చు : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ నివారణకు స్ర్కీనింగ్ పరీక్షలు ముఖ్యమని..మహిళలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే కేన్సర్‌ను జయించవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మహిళలకు కేన్సర్ పరీక్షలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిని ప్రాథమికంగా గుర్తిస్తే తదుపరి చికిత్సలు సులభతరం అవుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా మహిళల్లో కేన్సర్ ముందస్తు గుర్తింపునకు సీఎస్ఆర్ కార్యకలాపాల్లో భాగంగా జీఎస్ఎల్ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ తరుణ్ గోగినేని,డాక్టర్ సింధు తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో పోలవరం ధ్వంసం

పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు

రాజమహేంద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టు ధ్వంసమైందని ఆలిండియా పీసీసీ మాజీ అధ్యక్షుడు , రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో విఫలమైందని, సూపర్ సిక్స్ డకౌటయిందని ఎద్దేవా చేశారు. ఇవాళ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని చెబుతున్నారని, కానీ ఎన్నికల ముందు ఈవిషయం తెలియదా అని ప్రశ్నించారు. ఏపీలో హామీల అమలుకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా అరిగెల అరుణ కుమారి,చామర్తి లీల, జర్నలిస్ట్ విశాలాక్ష్మిని సన్మానించారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పార్టీనేతలు బాలేపల్లి మురళీధర్, బోడా వెంకట్, కొవ్వూరి శ్రీనివాస్, బెజవాడ రంగారావు, దేవత సుధాకర్, చింతాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 618 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షకు శనివారం ఏకంగా 618 మంది గైర్హాజరయ్యారు. గణితం, ఐబీ, జంతుశాస్త్రం-1, చరిత్ర-1, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షకు 618 మంది గైర్హాజరైనట్టు ఇంటర్మీడియట్ విద్య జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఇప్పటి వరకూ నిర్వహించిన ఏపరీక్షలోనూ ఇంత ఎక్కువ మంది గైర్హాజరు కాలేదు.. దీనిపై అధికారులు దృష్టి సారించారు.

జూన్‌లో కార్పొరేషన్ ఎన్నికలు

» ఇక నుంచి మీ పన్నులు మీకే
» ఏప్రిల్ ఒకటి నుంచి అమలు
» భవన అనుమతులు సులభతరం
» మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో వసూలు చేసే పన్నులు ఎక్కడికక్కడ వినియోగించుకునే విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఆయన టౌన్ ప్లానింగ్, రుడా, రెవెన్యూ విభాగాల అధికారులతో సమీక్షించారు. మునిసిపాలిటీలకు వచ్చే ఆదాయాన్ని వాటికే చెందేలా సీఎం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా మునిసిపాలిటీ ,రుడా పరిధిలో భవనాలు, లేఅవుట్లకు అనుమతులు త్వరితగతిన జారీ చేస్తామన్నారు.ఐదు అంతస్తులు, 15 మీటర్ల ఎత్తులో నిర్మించే భవనాలకు స్వీయ ధ్రువీకరణ ద్వారా అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనుమతులన్నీ చాలా సులభతరం చేశామన్నారు.రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల టీడీఆర్ స్కామ్ జరిగిందన్నారు. దీనిపై విచారణ జరుగుతుందన్నారు.విశాఖపట్నంలో విజిలెన్స్, సీఐడీలకు అప్పగించారని చెప్పారు. గోదావరి పుష్కరాలకు 29 నెలల సమయం ఉందని దీనికి సీఎం చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారని చెప్పారు. త్వరలో పుష్కరాలపై సమావేశం నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో వేస్ట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను 2014-19లో ప్లాన్ చేశామని అటుపై వచ్చిన వైసీపీ నిర్వీర్యం చేసిందని చెప్పారు. ఇప్పుడు మళ్లీ దృష్టి సా రించామన్నారు. ఒక్కో ప్లాంట్‌కు రూ.350 కోట్ల నుంచి రూ. 400 కోట్లతో ఖర్చవుతుందన్నారు. రాజమహేంద్రవరం-కాకినాడ, నెల్లూరు -తిరుపతి మధ్యలో, రాయలసీమలోను ఈ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మునిసిపాలిటీల్లో పన్నులకు సంబంధించి వడ్డీ మాఫీ పై పది రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జూన్‌లో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్డీవో కృష్ణనాయక్ పాల్గొన్నారు.

తాడిపూడి మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

» ఐదు కుటుంబాలకు రూ.25 లక్షల సీఎంఆర్ఎఫ్ అందజేత
» ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తాడిపూడి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో ఇటీవల గోదావరిలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన ఐదుగురు యువకుల కుటుం బాలను శనివారం పరామర్శించారు. అనంతరం ప్రభుత్వం తరపున సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మంజూరైన చెక్కులను అంద జేశారు. అందివచ్చిన కుమారులు మృత్యువాత పడితే ఆ బాధ ఎలా ఉంటుందో అర్థం చేసుకోగలనన్నారు.మీకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నా రు. మృతిచెందిన ఐదుగురు యువకుల చివరి కార్యక్రమాన్ని గ్రామస్తు లందరూ ఏకమై ఒకే చోట ఏర్పాటు చేయడంతో చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులర్పించారు. టీడీపీ యువగళం సభ్యులు ఒక్కొక్క కుటుం బానికి రూ.25 వేలు చొప్పున అందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే టివి రామారావు యువకుల కుటుంబాలను పరామర్శించి జనసేన నాయకులు సేరించిన లక్షా 50 వేలు అందించారు.ఈ కార్యక్రమంలో జొన్నల గడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, సూరప నేని చిన్ని, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, నామా కొండ బాబు, నామన పరమే శ్వరరావు,అనపర్తి ప్రసాదు, ఎంపీటీసీ వీరా హరిబాబు, అచ్యుతరాయుడు, పూలపల్లి బాలకృష్ణ, చౌటపల్లి శివ, దార్ల నాగలక్ష్మీ ప్రసాద్, మంచిగడ్డ మురళీ పాల్గొన్నారు.



మృతిచెందిన యువకుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించాలి

• కొవ్వూరు పట్టణ 9 వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ
• వాడవాడలా ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


గోపాలపురంలో ర్యాలీ చేస్తున్న మహిళా ఉద్యోగులు

కొవ్వూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించాలని పట్టణ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా హౌస్‌కీపింగ్ సిబ్బందిని సత్కరించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో రాణీసుష్మిత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు మన్యం గుప్తా ఆధ్వ ర్యంలోనూ వేడుకలు జరిగాయి. దీనిలో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం చైర్‌పర్సన్ బావన రత్నకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జీ.సాయికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతి, సెక్రటరీ తక్కెళ్లచిట్టిబాబు, వై.ప్రకాష్, నిమ్మగడ్డ పుల్లారావు, నీరుకొండ సూర్యనారాయణ, వీవీ సుబ్బారావు, ఎంపీడీవో కే. సుశీల, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా ఉద్యోగులు, వాసవీ క్లబ్, వజ్ర వనిత క్లబ్ సభ్యులు, కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఆర్డీవో డా. రాణీసుస్మిత, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సూరపనేని చిన్ని హాజరయ్యారు. దీనిలో భాగంగా పట్టణంలోని 13 స్వయం సహాయక సంఘాలకు రూ.2,30,00,000 చెక్కును అందించారు. అనంతరం ఆర్డీవో డా. రాణీసుస్మిత, చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మెప్మా సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్, పట్టణ సీఐ పీ. విశ్వం, టీడీపీ నాయకులు పెనుమాక జయరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, చావా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన మహిళా ప్రజాప్రతి నిధులు, ఉద్యోగులను సన్మానించారు. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా రాణించడం అభినందనీయమన్నారు. మలకపల్లి సర్పంచ్ రాపాక రాజేశ్వరి, కార్యాలయ సూపరింటెండెంట్ నిర్మల, కార్యదర్శి కామేశ్వరి, ఏపీవో రమాదేవి, మహిళా ఎంపీ టీలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బండారు నాగకుమారి, వీవోలు వనిత, పుష్ప, కుమారి, పలు గ్రామాల సమాఖ్య అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐటీడీఏస్, వెలుగు కార్యాలయాల్లోని మహిళా ఉద్యోగులను శనివారం సన్మానించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఉత్తమ మహిళా ఉద్యోగిగా ఏపీఎం రోజ్‌మాణిక్యం ఎం పికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

ఉండ్రాజవరం: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక డ్వాక్రా కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం. సందీప్, ఎంపీడీవో వీఎస్ రామారావు, మహిళా ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లోనూ వేడుకలను నిర్వహించారు. పాలంగి సచివాలయంలో మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: మహిళా సాధికారిత సాధించే దిశగా మనమంతా పయనించాలని పార్డ్ ఇండియా సంస్థ అధ్యక్షుడు ఎండీ షరీఫ్ అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా శనివారం నల్లజర్లలో మహిళా సర్పంచ్‌లు పల్లి జ్యోతి (నల్లజర్ల), గోతం సత్యలక్ష్మి(నబీపేట)ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొందల శ్రీనివాస్, జీవీవీ ప్రసాద్, కూరపాటి నాగరాజు, సోమిశెట్టి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: మహిళలే మన శక్తి అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


తాళ్లపూడిలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం


ఉండ్రాజవరంలో మాట్లాడుతున్న టీడీపీ నేత రామకృష్ణ


నల్లజర్లలో మహిళా సర్పంచ్‌లను సత్కరిస్తున్న పార్డ్ ఇండియా సంస్థ సభ్యులు


నిడదవోలు టీడీపీ కార్యాలయంలో మహిళలను సత్కరిస్తున్న నాయకులు

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు : ఎస్ఐ


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం

దేవరపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక బీహెచ్ ఎస్ఆర్‌వీఎల్ఎం డిగ్రీ కాలేజీలో శనివారం ఫేర్‌వెల్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడువ్యసనాలకు లోనుకావద్దని, తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. అనంతరం కాలేజీ చైర్మన్ సువర్ణరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో విద్యనందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మేరీ కమల, ప్రిన్సిపాల్ టీడీఎన్ కుమార్, ఏవో డీ.ఆనంద్ ప్రసాద్, అధ్యాపకులు ఎం.ప్రియాంక, ఎస్.వెంకటేష్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి , మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రెండు సీసీ రోడ్లు నిర్మించనున్నారు. దీనికి రూ. 8.83 లక్షల నిధులు కేటాయించారు. ఇందులో 14వ వార్డు కొత్త బ్రిడ్జిపేట వాటర్ ట్యాంకు రోడ్డు, రూ. 11.05 లక్షల వ్యయంతో 18వ వార్డు సత్యవతినగర్ లోని ఏపీ ఫైబర్‌నెట్ ఆఫీసు వద్ద పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చీర అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, కె. నవ్య, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే వర్ధంతిని జయప్రదం చేయండి

• కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు


సమిశ్రగూడెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు, కార్యకర్తలు

నిడదవోలు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సావిత్రీ బాయి పూలే 128వ వర్ధంతిని జయప్రదం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు పిలుపునిచ్చారు. శనివారం సమిశ్రగూడెంలోని లోహియానగర్‌లో వర్ధంతికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. దీనిలో భాగంగా ఈనెల 10వ తేదీన గుంటూరు జిల్లా నరసరావుపేటలో రాష్ట్ర సదస్సు జరగనుంది. కార్యక్రమంలో అధ్యక్షుడు మెరిపో జాన్‌రాజు, ముప్పిడి రవి, దిద్దే రాజు, కె.రవి, రమేష్, సతీష్, భీమారావు పాల్గొన్నారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

నల్లజర్ల, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ప్రకాశరావుపాలెంలోని మల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం గణపతి పూజ,ఏకాదశ రుద్రాభిషేకం, శాంతి కల్యాణం నిర్వహించారు.

స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు క్యూకట్టారు. అన్నసమారాధన చేశారు.

భౌబోయ్! .. ఆవుదూడపై కుక్కల దాడి




పారిశుధ్య సిబ్బంది సపర్యలు

ఆంధ్రజ్యోతి చెప్పింది అక్షరసత్యం.. అయినా నేటికీ చర్యల్లేవ్.. కుక్కల దాడులతో జనం బెంబేలెత్తి పోతున్నా.. పట్టించుకునే వారే లేరు.. జిల్లా వ్యాప్తంగా కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని.. జనం బెంబేలెత్తిపోతున్నారని గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది.. అయినా అధికారుల్లో మాత్రం కదలికలేదు. ఎండాకాలం కావడంతో దాడులకు తెగబడుతున్నాయి.. కొవ్వూరు గౌతమి నగర్‌లో శనివారం కుక్కల దాడిలో ఒక ఆవుదూడ తీవ్ర గాయాలపాలైంది.. అటుగా వెళుతున్న వారు గమనించి మునిసిపల్ చైర్మన్‌కు సమాచారం అందించారు.. ఆమె సూచనల మేరకు పారిశుధ్య సిబ్బంది కాపాడారు.. ఈ రోజు ఆవుదూడ అయ్యింది .. రేపు మనిషైనా ఆశ్చర్యపోనక్కర్లేద్దు.. అధికారులు ఇకనైనా చర్యలు తీసుకోండి.

- కొవ్వూరు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే


కరిచర్లగూడెంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

గోపాలపురం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం కరిచర్లగూడెంలో బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.9 లక్షల 18వేల 569 చెక్కులను పంపిణీచేశారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు కాట్రగడ్డ సురేష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు వేముల నాగరాజు, జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు పోసిన గణపతి, కొడూరి రఘురామ్, పసుమర్తి పెద్దబ్బులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. టీడీపీ నేత గన్నమని హరికృష్ణ ఇంటి వద్ద దేవరపల్లిలోని లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల పాలనలో సీఎం చంద్రబాబు పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 29 పంచాయతీలకు సంబంధించి 94 మంది లబ్ధిదారులకు రూ. కోటి లక్షా 18 వేల 474 చెక్కులు అందజేసినట్టు చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా మండల మహిళా సమాఖ్య సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేకును కట్ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అంద్రూ అనిల్, ఉప్పులూరి రాంబాబు, పెనుమత్స సుబ్బరాజు, బిక్కిన నాగరాజు, ముళ్లపూడి దొరాజీచౌదరి, యాగంటి వెంకటేశ్వరరావు, గద్దే రమాదేవి, జనసేన నాయకుల కంబాల సత్తిబాబు, సూరిశెట్టి బాలు, డ్వాక్రా మహిళలు, కార్యదర్శి ఎస్.రవికిషోర్, తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

'జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తరలిరావాలి'


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

కొవ్వూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈ నెల 14వ తేదీన జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి అధికసంఖ్యలో జనసైనికులు తరలిరావాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు వై. శ్రీనివాసరావు అన్నారు. శనివారం కొవ్వూరు టోల్‌గేట్ సెంటర్‌లోని టీవీఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు అధ్యక్షతన నియోజకవర్గ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మహిళలను సన్మానించారు. పట్టణ, మండల అధ్యక్షుడు డేగల రాము, సుంకర సత్తిబాబు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎరుబండి సురేష్, కె. నవ్య, కె. విజయకుమార్ , తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 324 కేసులు రాజీ


కేసులు పరిష్కరిస్తున్న 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 324 కేసులు రాజీ చేసినట్టు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు కొవ్వూరు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో 3 బెంచ్‌లను ఏర్పాటుచేసి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 1వ బెంచ్‌కు న్యాయమూర్తిగా 9వ అదనపు జల్లా జడ్జి, న్యాయవాది చక్రపాణి వ్యవహరించారు. సివిల్ కేసుల పరిష్కారం నిమిత్తం ఏర్పాటుచేసిన 2వ బెంచ్‌కు న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి జవీఎల్ సరస్వతి, న్యాయవాదిగా ఎం. వెంకటేష్ వ్యవహరించారు. క్రిమినల్ కేసుల పరిష్కారానికి ఏర్పాటుచేసిన 3వ బెంచ్‌కు న్యాయమూర్తిగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి. సాయికృష్ణ, న్యాయవాదిగా ఎం. రఘురామ్ ఆధ్వర్యంలో కేసులను పరిష్కరించారు. మొత్తం 324 కేసులు రాజీ అయ్యాయని, వాటిలో సివిల్ కేసులు 101, క్రిమినల్ కేసులు 223 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 32 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గణితం 1 బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణం, మండలంలో 520 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 488 మంది హాజరు కాగా, 32 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గణితం 1బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షకు 290 మందికి గాను 274 మంది హాజరవ్వగా, 16 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 156 మందికి గాను 140 మంది హాజరవ్వగా 16 మంది గైర్హాజరయ్యారు. కుమారదేవం గురుకుల కళాశాలలో 74 మందికి 74 మంది హాజరయ్యారు.

అన్నిదానాల్లో .. రక్తదానం మిన్న


రక్తదాన శిబిరంలో మానవతా, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వైద్యసిబ్బంది

తాళ్లపూడి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లో రక్తదానం మిన్న అని తాళ్లపూడి మండల మానవతా సంస్థ చైర్మన్, మండల ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్ధనరావు అన్నారు. శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మానవతా సంస్థ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 45 మంది పాల్గొని రక్తాన్ని దానం చేశారు. రాజమహేంద్రవరం సంజీవని బ్లడ్ బ్యాంక్ వైద్యసిబ్బంది, డాక్టర్ ప్రకాష్ వచ్చారు. కార్యక్రమంలో తాళ్లపూడి మండలాధ్యక్షుడు అంకెం సురేష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యం డపల్లి శేఖర్, అప్పన హనుమంతరావు, గోకవ రపు మాణిక్యం, సనపల రాజశేఖర్, పెమ్మాడి దుర్గాప్రసాద్ చాగల్లు, కొవ్వూరు మండలాల మానవతా చైర్మన్ జుజ్జవరపు ప్రసాద్, ఎన్ఆర్ఐ డైరెక్టర్ ఏ. వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మానవతా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణపై స్పెషల్ డ్రైవ్

గోపాలపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తసేకరణపై శనివారం గోపాలపురంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో వీఎస్ఎస్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోరుకొండ నరసింహ స్వామి తీర్థం

● అంగరంగ వైభవంగా ఉత్సవాలు
● దివ్య కల్యాణమహోత్సవాలకు ఏర్పాట్లు
● వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తులు


లక్ష్మీనరసింహ స్వామివారు

కోరుకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆది వారం సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నాయి. పాల్గుణశుద్ధ దశమి ఆదివారం సాయం త్రం అంకురార్పణ, ధ్వజారోహణతో కార్యక్రమాలు వైఖానస ఆగమనం ప్రకారం ప్రారంభమవుతాయి. 10వ తేదీ సోమవారం ఒంటి గంటకు రథోత్సవం, రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం. 11వ తేదీ మంగళవారం రాత్రి గరుడవాహనంసేవ, 12వ తేదీ బుధ వారం రాత్రి 7గంటలకు స్వామి వారి సదస్యం, రాత్రి 9 గంటలకుహనుమద్‌వాహనంపై గ్రామోత్సవం. 13తేదీ గురువారం రాత్రి 8గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, శ్రీరంగ రాజ స్వామి ఆలయంలో రాత్రి ఎనిమిది గంటలకు రంగనాథ స్వామి కల్యాణం. 14వ తేదీ శుక్ర వారం దేవుని కోనేరు వద్ద చక్రతీర్థం, సాయంత్రం ధ్వజారోహణ, అద్దాల సేవ, ఊంజల్ సేవ, రాత్రి తొమ్మిది గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవం, 15వ తేదీ శనివారం రాత్రి స్వామి వారికి శ్రీపుష్ప యాగం నిర్వహిస్తారు. రాష్ట్రం నలుమూ లల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచీ జనాలు భారీగా తరలివస్తారు. భక్తులకు ఎటువంటి కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానం దత్తత ఆలయంగా ఉన్న లక్ష్మీనరసింహస్వామి వారి మహోత్సవాలను కనుల పండువగా నిర్వహించాలని అన్నవరం ఆలయ వ్యవస్థాపక కుటుంబీకుడు ఐవీ రోహిత్ అధికారులకు సూచించారు. రంగరాజభట్టర్ స్వీయపర్యవేక్షణలో వైఖానస ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవనకుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకస్వాములు ఉత్సవాలు నిర్వహిస్తారు.